అంతర్జాతీయ రిఫరీగా మురళీకుమార్

భోగిళ్ళ మురళీకుమార్

సామర్లకోట: పట్టణంలోని ఎస్‌బిఎస్‌ఆర్‌సి క్లబ్ చెందిన బోగిళ్ల మురళీకుమార్ అంతర్జాతీయ కబడ్డీ రిఫరీగా ఎంపికయ్యారు. ఇప్పటి వరకూ ప్రో కబడ్డీ రిఫరీగా వరుసగా 10 సార్లు వ్యవహరించారు. జగ్గంపేట ప్రభుత్వ హైస్కూల్లో పిఇటిగా పని చేస్తున్న ఆయన ఈ నెల 28న ఇండియా-ఆస్ట్రేలియా మధ్య తొలిసారిగా మెల్‌బోర్న్‌లో జరిగే కబడ్డీ మ్యాచ్ రిఫరీగా వ్యవహరించనున్నారు. మురళీకుమార్‌ను జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, కోశాధికారి ఎన్.కిరణ్‌కుమార్, అంతర్జాతీయ కోచ్ సాయిప్రసాద్, రిటైర్డ్ పిఇటిలు టి.వైకుంఠం అభినందనలు తెలిపారు.

నిబంధనలు బేఖాతరు

- ఇంటర్మీడియట్ విద్యార్థులే లక్ష్యం
- నీట్, జెఇఇ మెయిన్స్ పేరుతో అడ్డగోలు దోపిడీ
- ఉదాసీనంగా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కార్పొరేట్ కళాశాలలు, కోచింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలను తిలోదకాలిస్తున్నాయి. ఇంటర్మీడియెట్ విద్యార్థులే లక్ష్యంగా అడ్డగోలు దోపిడీకి తెరలేపుతున్నాయి. తల్లిదండ్రులను మభ్యపెట్టి ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకూ వసూలు చేస్తున్నాయి. 'నీట్', జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షల కోసం ఏటా రూ.100 కోట్ల వ్యాపారం జరుగుతోంది. అధిక శాతం కేంద్రాలకు ఎటువంటి అనుమతులూ లేవని తెలుస్తోంది. నీట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ప్రైవేట్ కోచింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ అనుమతులు లేకుండానే శిక్షణ సంస్థలను పెట్టి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల్లో దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనధికార కోచింగ్ సెంటర్లను కట్టడి చేయడంలో అధికారులు వెకకబడుతున్నారు. నగరంలోనే ఏటా ఐదు వేల మందికి పైగా వివిధ కేంద్రాల్లో శిక్షణ తీసుకుంటున్నారని సమాచారం. ఒక్కో విద్యార్థికి రూ.2 లక్షల చొప్పున ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం రూ.100 కోట్ల వ్యాపారం నడుస్తున్నట్టు తెలుస్తోంది.

ఒక్కో విద్యార్థి ఫీజు రూ.2 లక్షలకు పైనే..

నీట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షల కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలు ఏడాదికి ఒక్కో విద్యార్థి వద్ద రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నాయి. ఆ సెంటర్లలో నిష్ణాతులైన బోధనా సిబ్బందిని నియమించడం లేదు. పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారిని అధ్యాపకులుగా నియమించి బోధన మమ అనిపిస్తున్నారు. అత్యధిక ర్యాంకులకు కేరాఫ్ తమ సంస్థనే అని కొన్ని కోచింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రచారం చేస్తున్నప్పటికీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ర్యాంకుల మాట అటుంచి, ఇంటర్ వార్షిక పరీక్షల్లో కూడా ఉత్తీర్ణులుకాని విద్యార్థులు ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అనధికారికంగా కొనసాగే కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. కొన్ని వసతి గృహాల్లో సౌకర్యాలు అధ్వానంగా ఉన్నాయి. ఇరుకైన అద్దె భవనాల్లో వసతి గృహాలు కొనసాగుతున్నాయి. వెలుతురు, గాలి లేని గదుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను ఉంచుతున్నారు. విద్యార్థులు స్నానం చేయాలన్నా, టాయిలెట్‌కు వెళ్లాలన్నా గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

అధికారుల చర్యలేవీ...?

నీట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ కోచింగ్ కేంద్రాల నిర్వాహకులు నగరంలో భనాలను అద్దెకు తీసుకుని ఆకర్షణీయమైన కటౌట్స్‌తోపాటు, కరపత్రాలు, పోస్టర్లతోపాటు ప్రసార మాధ్యమాల ద్వారా నీట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షల్లో అత్యధిక ర్యాంకులు సాధించినట్లు ప్రచారం చేసుకుంటున్నాయి. కొన్ని గుర్తింపు లేని వివిధ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలతో ఒప్పందం చేసుకుని కోచింగ్ ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇలాంటివి జిల్లా కేంద్రాల్లో పదుల సంఖ్యలో ఉన్నాయి. నిబంధనలు విస్మరిస్తున్నా ఇలాంటి కోచింగ్ సెంటర్లల్లో ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు ఎక్కడా లేవు.

తాళ్లరేవులోని అంబేద్కర్ భవన్ వద్ద మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

మనుస్మృతి ప్రతుల దహనం

ప్రజాశక్తి - కాకినాడ, తాళ్లరేవు

మనుస్మృతి దహన దివాస్ సందర్భంగా బుధవారం ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో మనుస్మృతి దహనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షురాలు డాక్టర్ భానుమతి, కెవిపిఎస్ నాయకులు మోర్త రాజశేఖర్ మాట్లాడారు. భారతదేశ ప్రజలను నాలుగు వర్ణాలుగా విభజించి, ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అంటూ నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను, అంటరానితనాన్ని వేల సంవత్సరాలు అమలు కావడానికి కారణమైన మనుస్మృతిని 1927లో అంబేద్కర్ దహనం చేశారని గుర్తు చేశారు. నాటి నుంచి దేశవ్యాప్తంగా మనుస్మృతి దహన కార్యక్రమం జరుగుతుందన్నారు.శూద్రులకు హక్కులు లేకుండా చేసి, వారిని బానిసలుగా చేసింది మనుస్మృతి అయితే, దేశ ప్రజలందరూ సమానమని చెప్పింది భారత రాజ్యాంగం అన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ప్రస్తుతం బిజెపి సర్కారు రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి తిరిగి మనుస్మృతిని తీసుకొచ్చేందుకు చూస్తుదన్నారు. అందులో భాగమే హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలన్నారు అమిత్ షాను బర్తరఫ్ చేసేవరకు అంబేద్కరీయులు, ప్రజాస్వామిక వాదులు, వామపక్ష పార్టీలు పోరాడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కెఎస్.శ్రీనివాస్, మాల మహానాడు నాయకులు ఎస్.కొండబాబు, ఆర్‌పిఐ నాయకులు పి.వరప్రసాద్, దళిత నాయకులు తాడి బాబ్జి, కెవిపిఎస్ నాయకులు సురేష్, సింహాచలం, పద్మనాభం, సిఐటియు నాయకులు దువ్వా శేషబాబ్జి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు. తాళ్లరేవు అంబేద్కర్ భవనం వద్ద మనుస్మృతి ప్రతుల దహనం కార్యక్రమం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగింది. జన చైతన్య మండలి జిల్లా అధ్యక్షులు కాశి రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జన చైతన్య మండలి వ్యవస్థాపక అధ్యక్షులు పావన ప్రసాద్, సామాజిక న్యాయ సాధన సమితి జిల్లా అధ్యక్షులు కె.భానుమతి, కోకన్వీనర్ ఎన్.పెద్దిరాజు, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, జి.శ్రీరాములు, పి.రామప్రసాద్, ఎలిపే నాగేశ్వరరావు, జక్కల ప్రసాద్‌బాబు, కె.ఈశ్వరిబాయి పాల్గొన్నారు.

కాకినాడ కలెక్టరేట్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మనుస్మృతి ప్రతుల దహనం చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

29 ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - కాకినాడ

డిసెంబర్ 29 తేదీన అన్నవరంలో జరుగుతున్న భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా మహాసభను జయప్రదం చేయాలనీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఆయన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభను అన్నవరంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభలో ముఖ్య అతిథులుగా పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ళ వెంకటేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను చర్చిస్తామని, జిల్లా వ్యాప్తంగా విద్యారంగంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ దశలవారి పోరాట ప్రణాళికను రూపొందిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యను మొత్తం ప్రయివేటీకరణ, కాషాయికరణ చేసుందుకు కుట్రలు సాగిస్తుందన్నారు. విద్యారంగంలో కార్పొరేట్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని, 117, 77 జీవోలను రద్దు చేయాలని, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, ఈ ఏడాది నుంచే విద్యార్థులకు తల్లికి వందనం, ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నవరంలో జరుగుతున్న జిల్లా మహాసభలను విద్యావేత్తలు, ప్రముఖులు, విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవ్, సహాయ కార్యదర్శి సాయిత్, సంజాయ్, జిల్లా కమిటీ సభ్యులు జైరామ్ పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తడిసిపోతున్న వరి పనలు

ప్రజాశక్తి - కోటనందూరు

అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పనలపై ఉన్న వరి పంట తడిసి ముద్దవుతోంది. కోతకు వచ్చిన పంట నేల వాలుతోంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండ లంలో అల్లిపూడి, కాకరాపల్లి, తాటిపాక, లక్ష్మీదేవిపేట, కోటనందూరు, పల్లి గ్రామాల్లో గత మూడు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ఆయా గ్రామాల్లో కోత కోసి పొలాల్లో పనలపై ఉన్న పంట తడిసి పోతుంది. పనలపై ఉన్న పంట తడిసిపోవడంతో గింజ రాలిపో తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోత దశలో ఉన్న వరి పంట సైతం నేలకు ఒరిగిపోతుంది. ఇప్పటికే ఎకరాలకు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకూ అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని, పంట చేతికొచ్చే దశలో అకాల వర్షం తమను నట్టేట ముంచుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 17 గ్రామపంచాయతీలో సుమారు 10,500 ఎకరాలకు పైగా వరి పంటను సాగు అయిందని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.చంద్రశేఖర్ తెలిపారు. ప్రస్తుతానికి కొంత పంటను కోతలు కోయగా, మరికొంత పంట కోత దశలో ఉంది. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పనలపై ఉన్న వరి పంటను జరిగిన నష్టాన్ని ప్రభుత్వం భరించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వర్షపు నీటితో తడిసిపోతున్న వరి పనలు

ప్రపంచ దేశాల జాతీయ పతాకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె ప్రాంగణంలో బుధవారం పూర్వ విద్యార్థి సుందర్ అసోసియేట్స్ ఛైర్మన్ డాక్టర్ బాదం సుందరరావు సహకారంతో ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలను ఇన్‌ఛార్జ్ ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి.మురళీకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రధాన కేంద్రమైన స్విట్జర్లాండ్ దేశంలోని జెనీవాలో ఉన్న 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలను ఆదర్శంగా తీసుకుని భారతదేశంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో తొలుతగా జెఎన్‌టియుకెలో ప్రపంచ దేశాల జాతీయ జెండాలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జెనీవా, అమెరికాలోని న్యూయార్క్, దక్షిణ కొరియాలోని సియోల్, చైనాలోని షాంఘై, డొమినికన్ రిపబ్లిక్‌లోని శాంటో డొమింగోలో ప్రపంచ దేశాల జాతీయ జెండాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆరవది జెఎన్‌టియుకెలో ఏర్పాటు చేశామన్నారు. అన్ని దేశాల జెండాలు ఒకే చోట ఉండడం ద్వారా కలిగే అనుభూతి చెప్పలేనిదన్నారు. ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన 194 దేశాల జాతీయ జెండాలు అక్షర క్రమంలో ఉంటాయని, ప్రతీ జెండా స్తంభానికి క్యూఆర్ కోడ్తో కూడిన డిస్ ప్లేను ఉంచడం జరిగిందన్నారు. దీని ద్వారా ఆ దేశ జనాభా, రాజధాని, కరెన్సీ తదితర పూర్తి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. జిల్లాలోని ప్రతీ స్కూల్, ప్రతీ సంస్థ జెఎన్‌టియుకెను సందర్శించి ఫోటోలు తీసుకోవడాన్ని గర్వంగా భావించడంతో పాటు విజ్ఞాన, పర్యాటక ప్రదేశంగా మారబోతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యేందుకు సహకరించిన యూనివర్శిటీ అధికారులకు, సుందర్ అసోసియేట్స్ ఛైర్మన్ డాక్టర్ బాదం సుందరరావు, సుధారాణి దంపతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సుందర్ అసోసియేట్స్ ఛైర్మన్ డాక్టర్ బాదం సుందరరావు మాట్లాడుతూ ఇన్‌ఛార్జ్ ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి. మురళీకృష్ణ వాక్ విత్ నేషన్స్ అనే కాన్సెప్ట్‌ను దేశంలో తొలిసారిగా ప్రపంచ దేశాల జాతీయ జెండాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను తీసుకువచ్చారన్నారు. పూర్వ విద్యార్థిగా ఈ ప్రాజెక్ట్‌ను సొంత ఖర్చుతో చేపట్టాలని నిర్ణయించుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ కెవి.రమణ, ఒఎస్‌డి ప్రొ డి.కోటేశ్వరరావు, ఛీఫ్ ఇంజనీర్ ప్రొ వి.శ్రీనివాసులు, మాజీ ఉపకులపతులు ప్రొ ఎస్.శ్రీనివాసకుమార్, ప్రొ జివిఆర్.ప్రసాదరాజు, ప్రొ కె.పద్మరాజు, డైరెక్టర్లు, యుసిఇకె ప్రిన్సిపల్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది. పూర్వ విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకెలో ఏర్పాటు చేసిన ప్రపంచ దేశాల జాతీయ పతాకాలు

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి - కాజులూరు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అవమానపరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ను తక్షణమే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని పలువురు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని శీలలంక గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద గ్రామ సర్పంచ్ బ్రహ్మాజీ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి అణగారిన కులాలు, మైనార్టీ మతాలపై దుర్భాసలాడుతూ సెక్యులర్ భావాలను దెబ్బ తీస్తుందన్నారు. మత ఉన్మాదులకు వ్యతిరేకంగా భారత రాజ్యాంగాన్ని అందరం కలిసి కాపాడు కోవాల్సిన అవసరం ఉందని,యువత అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

గ్రామాల పరిశుభ్రతే లక్ష్యం: ఎంఎల్ఎ దివ్య

ప్రజాశక్తి - కోటనందూరు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో నియోజవర్గంలో కోటనందూరు, తొండంగి, తుని మండలాలకు 15 ట్రాక్టర్లను పంపిణీ చేయడం జరిగిందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ యనమల దివ్య అన్నారు. బుధవారం తేటగుంట పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతను పరిరక్షించాలని ఉద్దేశంతో స్వచ్ఛభారత్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 15 ట్రాక్టర్లను ఆయా గ్రామాల పంచాయతీ అందజేసినట్లు చెప్పారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ ఉన్న బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యనమల రాజేష్, మోత్కూరు వెంకటేష్, బంటుపల్లి అన్వేష్, జక్కల రాము, చింతమనేడు అబ్బాయి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ యనమల దివ్య

సాఫ్ట్‌బాల్ పోటీల్లో గొల్లపాలెం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కాజులూరు

సాఫ్ట్ బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభను కనబరిచాడని గొల్లపాలెం జడ్‌పి పాఠశాల హెచ్‌ఎం ఎస్-ఎస్‌బి.సుశీలమణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో జరిగిన సబ్ జూనియర్ నేషనల్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తృతీయ స్థానం సాధించగా, ఆ జట్టులో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి దున్నా రోహిత్ ఉత్తమ ప్రతిభను చాటుకున్నాడని అన్నారు. ఈ సందర్భంగా రోహిత్‌తోపాటు, పీడీ జి.సునీల్‌కుమార్‌ను ఎంఇఒ డేవిడ్‌జాన్, ఎంపిడిఒ రాంబాబు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి ఛైర్మన్ కొలిశెట్టి సత్యం అభినందించారు.

కంప్‌తో క్రీడాకారుడు దున్నా రోహిత్

కార్టూ'నిజం'



ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జిల్లావ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే చర్చిల్లో ప్రార్థనలు ప్రారంభం అయ్యాయి. క్రైస్తవులు ఒకరికి ఒకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ రూరల్ కరప, కాకినాడ రూరల్ మండలాల్లో బుధవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎంఎల్ఎ పంతం నానాజీ పాల్గొన్నారు. క్రైస్తవ సంఘాలకు క్రిస్మస్ కేకులు, బహుమతులు అందజేశారు. క్రైస్తవులకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. **శంఖవరం** అన్నవరంలో టిడిపి నాయకుడు, ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ రాజాల చిట్టిబాబు తన స్వగృహం వద్ద నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు. ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. తొలుత స్థానిక సిసిబి చర్చ్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎంఎల్ఎ పాల్గొని ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజాల గంగాభవాని పాల్గొన్నారు. **తాళ్లరేవు** తాళ్ళరేవులో జరిగిన వేడుకల్లో పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్‌సాగర్ పాల్గొని మాట్లాడారు. పెంకేవారిపేటలోని న్యూలైఫ్ బేతెస్థ ప్రార్థన మందిరంలో పాస్టర్ డి.అబిషేక్ రూబెన్ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. **కోటనందూరు** తుని పట్టణంలో ఎస్ఎంబి, సీమోను ప్రార్థన మందిరాల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎంఎల్ఎ యనమల దివ్య పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కోటనందూరు మండలంలో అల్లిపూడిలోని గిడియన్ ఆర్మీ చర్చిలో బిఎల్ రాజు, ఆరుగుల మోషే, ప్రసాద్ పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు యనమల రాజేష్, అంకంరెడ్డి బుల్లిబాబు, గాడి రాజబాబు, అంకమ్మరెడ్డి రమేష్, గోపీనాథ్, షేక్ నవాజ్ జానీ, చింతమనేడు అబ్బాయి, మోత్కూరు వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ పాల్గొన్నారు. **సామర్లకోట** పట్టణ, మండలంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సెంటినరి బాప్టిస్ట్ చర్చి, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి, లూథరన్ చర్చిలతోపాటు, ఇతర చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో రెవ. డాక్టర్ బి.కిరణ్‌కుమార్, డాక్టర్ ఇమ్మానుయేల్, తదితరులు క్రిస్మస్ సందేశాలు ఇచ్చారు. పలు చర్చిల్లో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. **గొల్లప్రోలు** మండలంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బేతేలు ఆరాధన మందిరంలో పాస్టర్ జాషువా క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఆర్‌సిఎం దేవాలయంలో ఫాదర్ జేమ్స్ బాను క్రిస్మస్ ఆరాధన చేశారు. **ఏలేశ్వరం** మండలంలోని మర్రివీడు గ్రామంలో రిఫ్యూజ్ ట్రైబల్ చర్చ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చ్ నిర్వాహకులు జాకబ్, ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, ఏలేరు డి సి అధ్యక్షుడు ఎస్‌జివి.సుబ్బరాజు, మాజీ జడ్‌పిటిసి జ్యోతుల పెదబాబు, టిడిపి నాయకులు బొదిరెడ్డి గోపి, బస ప్రసాద్, చిక్కాల లక్ష్మణరావు, సూతి వీర ప్రభాకర్ పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు గిడజం గ్రామంలో బండారు బైరాగి ఆధ్వర్యంలోనూ, రాఘవపట్నం గ్రామంలో యాదగిరి జ్యోతిబాబు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించి పేదలకు దుస్తులు అందజేశారు.

శంఖవరం మండలంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ

కాకినాడ రూరల్‌లో పాల్గొన్న ఎంఎల్ఎ పంతం నానాజీ

తునిలో జరిగిన వేడుకలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ దివ్య

సామర్లకోటలో ఆటలపోటీల్లో పాల్గొన్న యువతులు

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో మండలంలోని చెందుర్తి గ్రామ శివారు పుష్కర కాలువ గట్టు సమీపంలో నిర్వహించిన కోడి పందాలపై దాడి చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. ఈ దాడిలో ముగ్గురుని అదుపులోకి తీసుకుని, 2 కోడిపుంజులు, రూ.2 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

ఘనంగా వాజ్‌పేయి శత జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని కాకినాడ రూరల్, గండేపల్లి, గొల్లప్రోలు కేంద్రాల్లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వాజ్‌పేయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వెంకన్న దొర కుటుంబానికి పర్వత పరామర్శ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరామపురం మాజీ సర్పంచ్ సోమరౌతు భాస్కరవెంకన్నదొర ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ప్రత్తిపాడు మాజీ ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్ బుధవారం పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రాక్ సిరామిక్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న కల్లోల్ ఘోష్

పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట - పెద్దాపురం పరిధిలోని పారిశ్రామిక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాక్ సిరామిక్స్ పరిశ్రమ ఉపాధ్యక్షుడు కల్లోల్ కుమార్‌ఘోష్ తెలిపారు. బుధవారం రాక్ పరిశ్రమ వద్ద ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఎస్ఎస్ డీలర్ షో రూమ్ ప్రత్యేక సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రాజేంద్ర సింగ్మాన్, హరీష్ కామత్, నరేశ్ రెడ్డి చంద్రశేఖర్, అభిరామ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

21 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట సర్కిల్ పరిధిలోని గండేపల్లి, కిర్లంపూడి, జగ్గంపేట మండలాల పోలీస్ స్టేషన్లో పరిధిలో 21 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు స్థానిక సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. కిర్లంపూడి లో 13 మంది, జగ్గంపేటలో ముగ్గురు, గండేపల్లిలో ఐదుగురు జూదరుల మీద బైండోవర్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. గుండాట, పేకాట, కోడిపందాలు, బొమ్మా బొరుసు, క్రికెట్ బెట్టింగులు, ఆన్‌లైన్ గేమ్స్ నిర్వహించిన, ఆడిన వారి మీద కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పలువురికి జక్కంపూడి పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

పలువురిని బుధవారం రాజానగరం మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా పరామర్శించారు. ఉండేశ్వరపురంలో ఇటీవల కారంకి కృష్ణ ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. కృష్ణ కుటుంబ సభ్యులను రాజా పరామర్శించారు. సుద్దపల్లి సూర్యారావు మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను, రాజానగరం మండలం పాలచర్లలో రావిపాటి శ్రీను తండ్రి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, కొత్త వెలుగుబందలో ప్రగడ శ్రీను తండ్రి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను రాజా పరామర్శించారు. అడపా బుజ్జి అనారోగ్యంతో చికిత్స పొంది, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను, అదే గ్రామానికి చెందిన కార్ల గిరి ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించారు. చక్రద్వారబంధంలో అయ్యల విష్ణు మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను, ముక్కినాడలో అన్నదాసు ఆదినారాయణ రావు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను రాజా పరామర్శించారు.

మట్టి మాఫియా ఆగడాలు

ప్రజాశక్తి - సీతానగరం

పెదకొండేపూడి, అచ్చియ్యపాలెం గ్రామాల మధ్య ఉన్న పాత గండికోటకు చెందిన ప్రభుత్వ కాలువ భూమిలో కొందరు వ్యక్తులు రాత్రి వేళల్లో లారీల ద్వారా మట్టిని, గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. గత అధికారుల కళ్లముందే లారీలతో మట్టిని తరలిస్తున్నా స్పందన కరువైంది. గ్రావెల్‌కు డిమాండ్ ఉండడంతో భారీ యంత్రాలతో పది అడుగుల లోతు తవ్వుతూ ఇళ్లకు, వెంచర్లకు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. నాణ్యమైన మట్టిని రూ.ఐదు వేల నుంచి రూ.పది వేల వరకూ లారీల ద్వారా అమ్ముతున్నారు. కొండలను నామరూపాలు లేకుండా చేయడం వల్ల పెద్ద పెద్ద చెట్లను తొలగించడంతో భవిష్యత్తులో పర్యావరణ సమస్యలు ఎదురై వర్షాలు కురవని సందర్భాలు ఎదురవుతాయి. ఇప్పటికైనా అటవీశాఖ, మండల అధికారులు తక్షణమే స్పందించి ఎటువంటి అనుమతులు లేకుండా లారీల ద్వారా మట్టిని, గ్రావెల్‌ను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బిజెపిలోకి శ్రీనివాసరావు

గోకవరం : మండల కేంద్రమైన గోకవరం తంటికొండ రోడ్ సిఎండి లేఔట్‌లో వ్యాపారవేత్త కంబాల శ్రీనివాసరావు బుధవారం బిజెపిలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి పాల్గొని పార్టీ కండువా కప్పి శ్రీనివాసరావును పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలని సూచించారు

సురక్షితంగా తీరానికి చేరుకున్న మత్స్యకారులు

ప్రజాశక్తి - కాకినాడ

చేపల వేటకు వెళ్లి అల్పపీడన కల్లోలిత సముద్రంలో చిక్కుకున్న నలుగురు మత్స్యకారులను కోస్ట్ గార్డ్, ఒఎన్‌జిసి సంస్థల సహకారంతో బుధవారం సురక్షితంగా తీరానికి చేర్చామని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన కాకినాడ పర్లోపేటకు చెందిన నలుగురు మత్స్యకారులు వాడమొదలు ధర్మరాజు, వాడమొదలు పెంటయ్య, మల్లాడి నాని, మల్లాడి సతీష్ కలిసి పడవలో చేపల వేట నిమిత్తం బోటులో భైరవపాలెం వైపు సముద్రంలోకి వెళ్లారన్నారు. సముద్రంలో 25 నాటికల్ మైళ్ల దూరంలో వేటసాగిస్తుండగా, అల్పపీడనం కారణంగా పెనుగాలులతో కల్లోలితమైన సముద్ర అలల్లో చిక్కుకుని తీరానికి రాలేక, భైరవపాలెం సమీపంలోని రిలయన్స్ రిగ్‌కు చెందిన పోల్ ఒకదానికి తమ పడవను తాళ్లతో కట్టి, సహాయం కోసం మత్స్యశాఖ అధికారులను ఈ నెల 24వ తేదీన ఫోన్ ద్వారా అభ్యర్థించారన్నారు. దీంతో మత్స్యశాఖ అధికారులు సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు ఇండియన్ కోస్ట్ గార్డ్ సహాయాన్ని కోరారన్నారు. కోస్ట్ గార్డ్, ఒఎన్‌జిసి రక్షణ బృందాలు సముద్రంలో చిక్కుకున్న నలుగురు మత్స్యకారులను రక్షించి, బోటుతో సహా సురక్షితంగా బుధవారం ఒడ్డుకు చేర్చాయన్నారు. కోరిన వెంటనే రక్షణ ఆపరేషన్ చేపట్టి ఎటువంటి అపాయం లేకుండా మత్స్యకారులను కాపాడిన ఇండియన్ కోస్ట్ గార్డ్, ఒఎన్‌జిసి సంస్థలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే బంగాళాఖాతంలో నెలకొన్న అల్పపీడనం తొలగిపోయే వరకూ మత్స్యకారులెవరూ చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదని, వాతావరణ శాఖ, మత్స్యశాఖ హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు.

నర్సీపట్నం టు నర్సాపూర్ సైక్లింగ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

సైక్లింగ్ యాత్రలో చిన్నారులు, యువకులు

బెంగళూరుకు చెందిన పలువురు చిన్నారులు, యువతి, యువకులు ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతాల అందాలను సందర్శించాలనే మక్కువతో సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ మేరకు నర్సీపట్నం నుంచి నరసాపురం వరకు 20 మంది బృందం చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం తాళ్లరేవుకు చేరుకుంది. రాష్ట్రంలోని తీరప్రాంతాలను, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిల్లాలోని కోనసీమ అందాలను తిలకించడంతోపాటు, సైక్లింగ్ వల్ల కలిగే లాభాలను ప్రజలకు తెలియజేస్తున్నట్లు బృంద నాయకుడు హితేష్ షా తెలిపారు. క్రిస్మస్ హాలిడే సందర్భంగా ప్రతి ఏడాది ఈ నేచర్ టూర్ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సెలవు రోజుల్లో మొబైల్ ఫోన్లతోనే కాలం గడుపుతున్నారని, ఈ విధంగా విహారయాత్ర చేయడం వల్ల ప్రకృతిలో సహజసిద్ధమైన నదులు, తీరప్రాంతాలు చూసి ఆనందించడమే కాకుండా భిన్న భావాల ప్రజలను నేరుగా కలుసుకునే అవకాశం ఏర్పడుతుందని హితేష్ అన్నారు. రోజుకి 100 కిలోమీటర్లు మేరా ప్రయాణం చేస్తామని తెలిపారు. ఈనెల 23వ తేదీన నర్సీపట్నంలో ప్రారంభించిన యాత్ర ఒకరోజు కాకినాడలో విశ్రాంతి తీసుకుని నర్సాపూర్‌కు బయలుదేరినట్లు తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపి వంగా గీత

27న విద్యుత్ ఛార్జీల పెంపుపై వైసిపి నిరసన

ప్రజాశక్తి - పిఠాపురం

విద్యుత్ ఛార్జీల పెంపుదలకు నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో పోరాబాట కార్యక్రమాన్ని ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపి వంగా గీత అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో పోరుబాట పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు చెప్పారని, అధికారంలోకి వచ్చాక ప్రజలపై మోయలేని భారాలను వేసిందన్నారు. తక్షణం విద్యుత్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈనెల 27న విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, నాయకులు గండేపల్లి బాబీ, బత్తుల సాయి, దత్తు, ఎస్. లలిత దేవి, పి రాజేష్, పి అప్పలరాజు, కాశీ, గణేష్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి వైథిలింగం

పేదల పక్షాన నిలబడేది కాంగ్రెస్ పార్టీయే...

ప్రజాశక్తి - యానాం

పేదల పక్షాన నిలబడేది కాంగ్రెస్ పార్టీ అని పుదుచ్చేరి ఎంపి వి.వైథిలింగం అన్నారు. పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు సేవ చేయాలనే భావన ఎంఎల్ఎకు, మాజీ మంత్రికి లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు చమురు సంస్థల నుంచి నష్టపరిహారం ఇవ్వాలని, దానికోసం పార్లమెంట్లో ప్రస్తావిస్తానన్నారు. చమురు సంస్థల వల్ల ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందుండి పోరాటం చేస్తుందని, ఫిబ్రవరి మొదటి వారంలో నష్టపరిహారంపై పోరాటం చేస్తామన్నారు. ప్రజలు ఈ పోరాటానికి మద్దతు పలకాలన్నారు. ఈ సమావేశంలో ములగపాటి ప్రసాద్ రాజు, చీకట్ల రామకృష్ణ, దున్నా చక్రవర్తి, కె.హరిసత్యనారాయణ, పి.సుబ్బరాజు, వినోద్, ఓలేటి శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.

చిన్నారులను అభినందిస్తున్న నిర్వాహకులు

సత్తా చాటిన శ్రీవేద విద్యార్థులు

ప్రజాశక్తి - యానాం

కాకినాడలో నిర్వహించిన 3వ ఇన్విటేషన్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ - 2024 పోటీల్లో శ్రీవేద స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని స్కూల్ ఛైర్మన్ గుత్తుల గోవింద జయరామారావు బుధవారం తెలిపారు. 5వ తరగతి విద్యార్థి పి.జయశ్రీ బంగారు పతకాన్ని, 4వ తరగతి విద్యార్థి కె.జశ్విర్ వెండి పథకాన్ని, 1వ తరగతి చదువుతున్న సిహెచ్.నిఖిలేష్ కాంస్య పథకాన్ని సాధించారన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ గుత్తుల గోవింద జయ రామారావు, డైరెక్టర్స్ నీతూ, అర్జున్ అభినందించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - యానాం

క్రిస్మస్ వేడుకలో మాట్లాడుతున్న తోటరాజు

క్రిస్మస్ వేడుకలు యానంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చర్చిల్లో ప్రముఖ వ్యాపారవేత్త తోటరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోటరాజు క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాస్

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం సిఐ శ్రీనివాస్ అన్నారు బుధవారం అమీనాబాద్ సెంటర్లో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని వ్యక్తుల నుంచి ఫోన్లు చేసి మీకు లోన్లు, డ్రాలు వంటి వాటికి ఎంపికయ్యారని తెలిపితే అలాంటి ఫోన్లను నమ్మవద్దని తెలిపారు. మొబైల్‌లో యాపల ద్వారా అనేక మోసాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

మల్లేపల్లిలో మిలటరీ హోటల్ ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి గ్రామ జాతీయ రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన రాయుడు గారి మిలట్రీ హోటల్‌ను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ బుధవారం ప్రారంభించారు. ఏరుకొండ రఘురాం ఆధ్వర్యంలో తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన్‌రావు, సొసైటీ మాజీ అధ్యక్షులు పరిమి బాబు, కందుల చిట్టిబాబు, జాస్తి వసంత్, పరిమి వాసు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో క్రిస్మస్ వేడుకలు

పజాశక్తి-రాజమహేంద్ర వరం

క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న స్వర్ణాంధ్ర రాంబాబు

మనుషుల మధ్య సామరస్యం సహద్భావ వాతావరణం పెంచేలా జీసస్ క్రైస్ట్‌ను ప్రేరణగా తీసుకోవాలని స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు పిలుపు ఇచ్చారు. బుధవారం ఉదయం స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వద్ధాశ్రమంలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సాటి మనిషి పట్ల కరుణ దయ కలిగి ఉండడమే నిజమైన క్రైస్తవ భావనని తెలిపారు. వివిధ మతాలు కులాలు అందరూ సామరస్యంగా ఉండే చోట ఇలాంటి వేడుకలు మనుషుల మధ్య మంచి స్నేహ సంబంధాలు ఏర్పరుస్తాయని అన్నారు. వృద్ధులు, నిరాశ్రయుల కోసం వారి పునరావాసం కోసం స్వర్ణాంధ్ర సేవా సంస్థ జీసస్ సేవా మార్గంలో పనిచేస్తుందని రాంబాబు ఉద్ఘాటించారు. అవసరార్థులను చేరదీయడం, ఆదరించడం వారిలో పరివర్తనకు కృషి చేయడమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర గత 27 సంవత్సరాలుగా రాజమండ్రి కేంద్రంగా దాతల సహకారంతో నిరంతరం పని చేస్తోందని రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ, కొండలరావు, శ్రీహరి, ప్రసాద్, ధనలక్ష్మి, మీరా కుమారి, శేఖర్ పాల్గొన్నారు.

ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో మెడల్ సాధిస్తా

రోలర్ హాకీ కాంస్య పతక విజేత నాగ సాయి కేశవ్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తల్లిదండ్రులతో కాంస్య పతక విజేత కేశవ్

రాష్ట్రంలోని మంగళగిరిలో 2027లో నిర్వహించనున్న ఏషియన్ ఛాంపియన్‌షిప్ రోలర్ హాకీలో మెడల్ సాధించడమే తన లక్ష్యమని మునుపర్తి నాగ సాయి కేశవ్ ధీమా వ్యక్తం చేశాడు. డిసెంబర్‌లో కోయంబత్తూర్‌లో నిర్వహించిన అండర్ 14, సబ్ జూనియర్స్ విభాగంలో నేషనల్ రోలర్ స్కేటింగ్ హాకీకి జాతీయస్థాయి పోటీల్లో ఎపి టీమ్ గోల్ కీపర్‌గా కాంస్య పతకం సాధించాడు. కేశవ్ మండలంలోని గ్రామానికి చెందిన మునుపర్తి రమేష్, దేవి ఏకైక కుమారుడు. ఉద్యోగ నిమిత్తం బుట్టాయిగూడెం నుండి వచ్చి, చివటం, జగనన్న కాలనీలో రమేష్ కుటుంబం నివాసం ఉంటోంది. 12 ఏళ్ల కేశవ్ తణుకు ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో ఎఫ్‌వన్ మెరిట్ స్టూడెంట్‌గా చదువుతున్న కేశవ్ గత రెండేళ్ల నుంచి రోలర్ స్కేటింగ్ హాకీ సాధన ప్రారంభించారు. పాఠశాలలోనే కోచ్, ట్రైనర్ భార్గవ్ వద్ద శిక్షణ పొందుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. మూడు నెలల శిక్షణా కాలంలోనే తణుకు పట్టణంలో జిల్లాస్థాయి ట్రయల్స్‌లో పాల్గొని, అనంతరం జాతీయస్థాయి పోటీలలో మెడల్స్ సాధించాడు. ఈ నేపథ్యంలో 2023 స్టేట్ ఆర్ఎస్ఎఫ్ఐ రోలర్ స్కేటింగ్ హాకీలో కాంస్య పతకం సాధించాడు. అదే సంవత్సరం జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. చండీఘర్‌లో జరిగిన 61వ నేషనల్ స్కేటింగ్ చివరి దశలో పాలు పంచుకోవడం, వాతావరణం అనుకూలించకపోవడంతో ఓటమి పాలయ్యాడు. 2024 రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ హాకీలో సిల్వర్ మెడల్ సాధించాడు. నవంబర్ నెలలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ ద్వారా సిల్వర్ పతకం అందుకున్నాడు. దేశం తరపున, అంతర్జాతీయ స్థాయి పోటీలలో తన కుమారుడు పాలు పంచుకోవడానికి, తాము ఎంత కష్టమైనా భరిస్తామని కేశవ్ తల్లిదండ్రులు తెలిపారు. ఈ సందర్భంగా కేశవ్‌కు పాఠశాల యాజమాన్యం, బంధువులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

'పల్లె పండుగ' పనుల్లో నాణ్యత కరువు

కానరాని అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి - జగ్గంపేట

బూడిదతో కలిపి ఉన్న కంకర

పల్లె పండుగ పనుల్లో నాణ్యత లోపిస్తోంది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నాణ్యత ప్రమాణాలను పాటించడం లేదు. ఆయా పనులపై అధికారులు పర్యవేక్షణ కరువుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

గత ఐదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధి నిర్లక్ష్యానికి గురియైంది. గత ఎన్నికల్లో కూటమి పార్టీలకు గ్రామాల అభివృద్ధి అంశమే ప్రధాన అస్త్రంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టే ఉపాధి హామీ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో పెద్దఎత్తున గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేసేందుకు సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. దీనిలోభాగంగా మండలంలో పలు గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. జగ్గంపేట నుంచి గోకవరం వెళ్లే రోడ్డులో ఉన్న ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల రోడ్ జంక్షన్ నుంచి కాపు కళ్యాణ మండపం, స్టేడియం వరకూ సిసి రోడ్డు నిర్మాణ పనులు గత కొన్ని రోజులుగా జరుగుతున్నాయి. చోట్ల సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో పనులు లేక ఇబ్బందులు పడ్డా కాంట్రాక్టర్లు ప్రస్తుతం పనుల్లో బిజీ అయిపోయారు. దీనికితోడు కాంట్రాక్టర్లు చేపడుతున్న ఆయా నిర్మాణాలకు సంబంధించి నాణ్యత ప్రమాణాలు పాటించాల్సివుంది. అయితే ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణంలో ఎటువంటి నాణ్యత ప్రమాణాలను పాటించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నాసిరకపు మెటీరియల్ వాడుతూ నిర్మాణాలు సాగిస్తున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సిసి రోడ్డు నిర్మాణానికి కంకరతోపాటు, బుడిదను కలిపి వాడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆయా పనులను నిరంతరం పర్యవేక్షించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సిసి రోడ్డు నిర్మాణానికి సంబంధించిన నాణ్యతపై పంచాయతీరాజ్ శాఖ జెఇని వివరణ కోరేందుకు ప్రజాశక్తి సంప్రదించగా పొంతన లేని సమాధానం చెప్పడం విశేషం.

చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారి

పాదగయను దర్శించుకున్న హైకోర్ట్ జడ్జి, మెరైన్ ఎస్‌పి

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం (పాదగయ)ను హైకోర్టు జడ్జి కిరణ్మయి, మెరైన్ ఎస్‌పి పి.రవివర్మ సతీసమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దర్శనానంతరం దేవస్థాన వేదపండితులు, అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి కాట్నం జగన్మోహన్, శ్రీనివాస్ శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

పత్రికా ప్రకటన

దేవరపల్లి మండలం, చిన్నాయగూడెం గ్రామ తాలూకు **గద్దే దీపిక D/o వెంకటరామారావు** గారిది ఈ దిగువ చూపబడిన ఆస్తికి సంబంధించి దస్తావేజు **నెం.1915/2008, ది.24-05-2008** నందిగూడెం గ్రామానికి చెందిన **ఆర్.యస్.నెం.10, 3 ఎకరాలు** గల డాక్యుమెంటుకు సంబంధించి యర్నగూడెం బ్యాంక్ నుండి చిన్నాయగూడెం మోటార్ సైకిల్ పై వచ్చుచుండగా దారిలో పడిపోయినది. కావున దొరికిన వారు సెల్ నెం. 9441780902 కు తెలియపర్చగలరు.

గద్దే దీపిక D/o వెంకటరామారావు
ఇంటి నెం.5-18, చిన్నాయిగూడెం,
రామాలయం వీధి,దేవరపల్లి
మండలం,తూర్పుగోదావరి జిల్లా
సెల్ 9441780902

ప్రకటన



కీ॥శే॥ కాంద్రేగుల అమ్మన్న(లేటు)

డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం గున్నేపల్లి అగ్రహారం గ్రామ కాపురస్తులు కాంద్రేగుల మహాలక్ష్మి w/o రామసుబ్రహ్మణ్యం (లేటు) వ్రాయించి ఇచ్చిన ప్రకటన

నా అత్తయ్య కాంద్రేగుల అమ్మన్న w/o సుబ్బన్న గున్నేపల్లి అగ్రహారం గ్రామంలో మా ఇంటి వద్ద ది.19-02-2016 సం॥రం॥ లో మరణించారు. వీరి మరణం నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు:
కాంద్రేగుల మహాలక్ష్మి
w/o రామసుబ్రహ్మణ్యం (లేటు),
C/o కాంద్రేగుల సాయిబాబు s/o సుబ్బన్న,
గున్నేపల్లి అగ్రహారం,అమలాపురం మండలం,
సెల్:98487 37920

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, PITHAPURAM
E.P. No.1/2020 in O.S. No.852/2016
Between:
Yarramsetti Satya Surya Kumari ...DHr/Plaintiff
and
Patamsetti Ganga Rao & another ..JDRs/Defendants
To: JDRs:
JDR-1: Patamsetti Ganga Rao
S/o. Satti Raju, aged 48 years, Business, D.No.67-7-4/9A, Ashok Nagar, Kakinada.
JDR-2: Smt. Patamsetti Hemadevi,
W/o. Ganga Rao, D.No.67-7-4/9A, Ashok Nagar, Kakinada.

పై నెంబరు అమలు గ్రంథములో 1వ మరియు 2వ JDrs అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.**21-01-2025** తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం **10.30** ని॥లకు పై శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకో వలెను. లేని యెడల పై అమలు గ్రంథము మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

D.సుబ్రహ్మణ్యం
V.V.V.S.L.కిరణ్
M.ధనుంజయరావు
అడ్వకేట్స్, సుభద్ర ఆర్కేడ్, భానుగుడి జంక్షన్, కాకినాడ, సెల్: 9849715132
N.మనోజ్‌కుమార్
అడ్వకేటు, పిఠాపురం

IN THE COURT OF THE IInd ADDITIONAL JUNIOR CIVIL JUDGE :KAKINADA
O.S.NO. 395/2023
Between:
State Bank of India Retail Assets, Small & Medium Enterprises Center, Kakinada represented by its Authorized signatory, Visamsetty Rajasekhar ...**Plaintiff**
And
1. ASAD Apparels Private Limited, Rep by its Managing Director Mohammed Amirun Begum and others ...**Defendants**
To.
1. ASAD Apparels Private Limited, Kakinada Rep by its Managing Director Mohammed Amirun, W/o Mohammed Asad Ullah, aged 33 Years, D.No.17-2-60/35, Opp. AMG Road, Kakinada.
2. ASAD Apparels Private Limited, Kakinada Rep by its Director Shaik Ziauddin, S/o Shaik Mohammad, aged 27 Years, D.No.17-2-60/35, Opp. AMG Road, Kakinada
3. Mohammed Amirun Begum, W/o Mohammed Asad Ullah, aged 33 years, Business, D.No.20-11-13, Block No. G1, Ratna Towers, Masid Center, Main Road, Kakinada
4. Shaik Zlauddin, S/o Shaik Mohammad, aged 32 years, Business, D.No.17-2-60/35, Opp. AMG Road, Kakinada.

పై నెంబరు దావాలో **1 To 4** ప్రతివాద్దులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 29-01-2023** తేదికి వాయిదా వేసినారు మీరు ఆ రోజు ఉదయం **గం.10.30** ని॥లకు పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని మీ వకీలు గారి ద్వారా గాని హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)
K.V.S.V.లక్ష్మాజిరావు
అడ్వకేట్, కాకినాడ
సెల్:9866211196